

12 నుంచి డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఈ నెల 12వ తేదీ నుంచి ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రావిరాల రమేష్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 9133443734కు చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్తిస్థాయిలో చేరని విద్యా కానుక

- ఇంకా రావాల్సినవి 12.77 లక్షలు
- రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం



పుస్తకాలను పాఠశాలలకు పంపుతున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ నెల 12 నుంచి పాఠశాలల పున ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యా కానుక కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని ఒక పక్క ప్రభుత్వం, మరోవైపు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అన్ని పుస్తకాలు ఇంకా చేరుకోలేదు. విద్యా కానుకలో పలు వస్తువులు ఇంకా రాలేదు. కాకినాడ జిల్లాలో 1,283 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 76,920 మంది బాలురు, 82,877 మంది బాలికలు మొత్తంగా 1,59,797 మంది చదువుతున్నారు. జగనన్న విద్యా కానుక కిట్లో నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, డిక్షనరీ, మూడు జతల యూనిఫామ్, బ్యాగు ఇస్తున్నారు. కుట్టించుకునేందుకు కుట్టుకూలీ ఇస్తారు. వేసవి సెలవుల్లోనే ఈ కిట్లను పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు పంపిణీ చేస్తారు. అందుకు తగ్గట్టు ఎస్ఎస్ఎ అధికారులు అన్ని పాఠశాలలకూ వీటిని అందివ్వాలి. కానీ ఆచరణలో పూర్తిస్థాయిలో సామాగ్రి చేరుకోలేదు.

పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఏవీ.?

జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు 1.60 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరందరికీ కలిపి 14,57,599 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయి. ఇప్పటి వరకు 11,80,452 మాత్రమే పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇంకా 2,77,147 పుస్తకాలు రావాల్సి ఉంది. కోటనందూరు మండలంలో 32 పాఠశాల లుండగా 30,077 పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం 17,404 మాత్రమే అందాయి. ఇంకా 12,673 పుస్తకాలు చేరాల్సి ఉంది. కరపలో 65 పాఠశాలుండగా 57,983 పుస్తకాలకు గానూ 34,820 అందాయి. ఇంకా 23ర,163 పుస్తకాలు రావాలి. ఏలేశ్వరం మండలంలో 40 పాఠశాలకు 62,244 పుస్తకాలు రావాల్సి ఉండగా 37,385 అందాయి. ఇంకా 24,859 పుస్తకాలు రావాలి. ఇలా పలు మండలాల్లో పాఠశాలలకు పూర్తిస్థాయిలో పుస్తకాలు చేరుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విద్యా కానుక కిట్లు పూర్తిస్థాయిలో చేరుకోని పరిస్థితి నెలకొంది. పాఠశాలలు ప్రారంభం నాటికే అన్ని వస్తువులు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందజేస్తామని విద్యాశాఖ అధికారులు ఏటా చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారు. ఈ సంవత్సరం కూడా ఇదే పరిస్థితి ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు చేరేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యా కానుక కిట్లలో వస్తువులన్నీ నాణ్యతతో అందివ్వాలని పలువురు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వస్తువులు	రావాల్సినవి	వచ్చినవి
నోటు పుస్తకాలు	1043318	1026282
బెల్ట్	108587	108535
షూస్	159275	156586
సాక్స్	318550	317746
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీస్	18180	18180
పిక్టర్స్ డిక్షనరీ	9034	8025
పాఠ్య పుస్తకాలు	1457599	1180452

దళితుల సమస్యలపై నిరంతర పోరాటాలు

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి



సభలో మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు ఆగకపోగా పెరిగాయని దళితుల సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు సాగించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. కెవిపిఎస్ జిల్లా ప్రథమ మహాసభ కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో శనివారం బి.సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ దళిత చైతన్యం ఎక్కువగా ఉన్న కాకినాడ జిల్లాలో కూడా ఎక్కువగా దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ఇటీవల ఎంఎల్‌సి అనంత ఉదయ భాస్కర్ కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య దారుణమన్నారు. హత్య కేసులో నిందితునిగా ఉన్న ఉదయ భాస్కర్ జైలు నుంచి బెయిల్ పై వచ్చిన సందర్భంగా ఊరేగింపు నిర్వహించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. తొండంగి మండలం శంగవక్షంలో దళితపేటపై దాడి చేసి దళితుని దారుణంగా హత్య చేశారన్నారు. పిఠాపురం మండలం మల్లంలో జాతర సందర్భంగా జరిగిన చిన్న సంఘటనలు దష్టిలో ఉంచుకుని అగ్రవర్ణాలకు చెందిన పలువురు ఎస్‌సి కాలనీపై దాడి చేసి దళితులను భయభ్రాంతులకు గురిచేసి దారుణంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. దళితులపై దాడులు దౌర్జన్యాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా యంత్రాంగాలకు దిశా నిర్దేశం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

జిల్లాలో నేటికీ చాలా గ్రామాలు, మున్సిపల్ పట్టణాల్లో దళిత కాలనీలకు శ్మశాన స్థలాలు లేవని, ఉన్నవి కూడా కొన్నిచోట్ల ఆక్రమణలకు గురయ్యాని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి రెండు బస్సు యాత్రలు కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

సీనియర్ దళిత నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా కుల వివక్షపై సర్వేలు చేసి జిల్లాల్లో వివిధ రూపాల్లో ఉన్న కుల వివక్ష పై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిన ఫలితంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పడిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాను చట్టం కోసం కెవిపిఎస్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారని తెలిపారు. ఇటీవల మరణించిన కెవిపిఎస్ సీనియర్ నాయకుడు వసంత కుమార్ చిత్రపటానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మహాసభలో దళిత నాయకులు బచ్చుల కామేశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, ప్రజా సంఘాల నాయకులు ఎం.రాజశేఖర్, కెఎస్ శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, సిహెచ్.అజయ్ కుమార్, జి.భాస్కర్, కెవిపిస్ నాయకులు కె.సింహాచలం, కె.లోవరాజు, విప్పర్తి శ్రీను, ఎన్.రాజు, వై.నాని బాబు, కెవి రమణ విచక్రధర్ రావు, కె.శివశంకర్, పులపకూరి కృష్ణ, గొల్లపల్లి ఏసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ గీత శంకుస్థాపన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వికెరాయపురం గ్రామంలో పలు అభివద్ధి పనులకు కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ శనివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దావులూరి దొరబాబు ఆధ్వర్యంలో మండలంలోని మాధవపట్నం, వికె.రాయపురంలో పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే స్థానిక గ్రామానికి రూ.7 లక్షలు నిధులు మంజూరు కాగా వాటి పనులను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడారు. మాధవపట్నం, వికె.రాయపురం గ్రామాల పరిధిలో ఉత్తమ వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, తలారి దొరబాబు, ఊటా వాసు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

తెలుగు వ్యాకరణంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం సామర్లకోట మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు తులసి రాంబాబు తెలుగు వ్యాకరణం, పందులు, సమాసాలు, చందస్సు, అలంకారాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. స్టార్ ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయులు ఎస్ వీరబాబు ఆధ్వర్యంలో పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడం, పాటలు పాడడంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు.

సబ్జెక్టు టీచర్స్ కొరతపై యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్స్ కొరతను నిరోధించి విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి యుటిఎఫ్ నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కాకినాడ నగర శాఖ అధ్యక్షులు సిహెచ్.వరహాలబాబు, ప్రధాన కార్యదర్శి బి.రవి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వజ్రపు మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్.వి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు కొరత, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థుల కొరత ఉందన్నారు. తమ అభ్యర్ధన లను పరిశీలించి కాకినాడ నగర పాలక పాఠశాలల విద్యాప్రమాణాలు మెరుగుదలకు చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి చెరువులో చేపల వేట ఆపాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట ఫిల్టర్ బెడ్ చెరువుగా ఉన్న స్థానిక ఉండూరు రోడ్డులోని ఎన్ఎఫ్‌సిఎల్ చెరువులో జోరుగా చేపల వేట సాగుతోంది. తాగునీటి జలాలను మరింత కలుషితం చేస్తూ చేపల వేటను నిర్వహించడం పట్ల జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు ఫిర్యాదు చేశారు. కనీసం రెండు మీటర్ల నీటి సామర్థ్యం కూడా లేని ఫిల్టర్ బెడ్ చెరువులో చేపల వేటను చేపట్టడం వల్ల ఉన్న కొద్దిపాటి జలాలు పూర్తిగా కలుషిత మవుతున్నాయని, దీనికి తోడు ప్రస్తుతం గోదావరి కాలువకు తాజాగా జలాలు విడుదల కాగా ధవళేశ్వరం మొదలు సామర్లకోట వరకు ఉన్న గ్రామాల్లోని వ్యర్థాలతో కూడి వస్తున్న జలాలను ఈ ఫిల్టర్ బెడ్ చెరువులో అధికారులు నింపుతున్నారని తెలిపారు. ఆ జలాలేను కుళాయిల ద్వారా మున్సిపాలిటీ అందిస్తుండగా వాటిని అతి కష్టంగా ప్రజలు తాగుతున్నాన్నారు. చేపల వేటతో చెరువులోని జలాలు మరింత కలుషిత మవుతుంటే ప్రజల ఆరోగ్యం ఏమవుతుందని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ప్రశ్నించారు. దీనిపై తక్షణం అధికారులు స్పందించి చేపలవేటను ఆపకుంటే రాష్ట్ర మానవహక్కుల సంఘానికి పిర్యాదు చేయనున్నట్టు ఆయన అధికారులను హెచ్చరించారు. కాగా తమ చేపల వేటకు ఈనెల 25వ తేదీ వరకు అనుమతులు ఉన్నాయని ప్రజారోగ్యానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తదుపరి చేపల వేటను నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కమిషనర్ రామారావు ఫిల్టర్ బెడ్ చెరువును సందర్శించి చేపల వేట నిర్వాహకులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

కుళాయిల్లో మురుగు నీరు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని కాట్రావులపల్లిలో సచివాలయం 3 పరిధిలో ఉన్న పంచాయతీ కుళాయిల్లో మురుగు నీరు వస్తోందని కాలనీవాసులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య వారికి మద్దతు తెలిపారు. వారం రోజులుగా పంచాయతీ కుళాయిల్లో మురుగు నీరు వస్తోందని, పశువులు కూడా తాగే పరిస్థితిలో లేదని తెలిపారు. పంచాయతీ దగ్గరికి వెళితే వారు పట్టించుకోలేదని, కలెక్టర్ ఆఫీస్‌లో స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. లేని పక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి నరేష్ పొట్ట బుజ్జి, అడబాల వీరబాబు ఉన్నారు.

రూరల్ ఎంపిడిఒగా స్వప్న బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందిస్తానని నూతనంగా కాకినాడ రూరల్ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన కె.స్వప్న తెలిపారు. స్థానిక రమణయ్యపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో స్వప్న శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రూరల్ పంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి గోదావరి జిల్లాల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు జొన్నాడ నరసింహారావు ఆధ్వర్యంలో ఎంపిడిఒను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. అనంతరం సూపరిం టెండెంట్ జె.శ్రీనివాసరావు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండిఓ స్వప్న మాట్లాడుతూ ఎంఎల్ఎ కన్నబాబు సహకారంతో రూరల్ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు.

సమాజ వికాసం బాలల్లో ప్రతిబింబించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజ వికాసం బాలల్లో ప్రతిబింబించినప్పుడే సమాజం అభివద్ధి చెందుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 34 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చదువు, విజ్ఞానం, ఆట, పాట, ఆనందం కలగలిసినదే బాల్యమన్నారు. 34 రోజులపాటు నిర్వాహకుల శ్రమ బాలల ఉరిమే ఉత్సాహంగా వెల్లివిరిసిందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కష్ణ బాబు మాట్లాడుతూ మండు వేసవిలో 34 రోజులపాటు ఈ శిబిరాన్ని నిర్వహించిన వారిని అభినందించారు. కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు, దారపరెడ్డి సత్యనారాయణ, మహా పాతిన రాంబాబు, దారపురెడ్డి కష్ణ బందం అభ్యుదయ గీతాలు ఆలపించారు. సమ్మర్ క్యాంపులో రీసెర్చ్ పర్స న్స్‌గా వ్యవహరించిన వారందరినీ అతిథులు సన్మానించారు. ఈ సభలో పాణంగిపల్లి వెంకట చలపతిరావు, బి.అనంతరావు, పెద్దిరెడ్డి నరేష్, దేవత రాజేష్ కుమార్, బుద్ధ శ్రీనివాసరావు ప్రసంగించారు. విద్యార్థులందరికీ ముప్పన వీర్రాజు బహుమతులు అందజేశారు. అతిథులకు చలపతిరావు మెమొంటోలు అందజేశారు.



సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ కృష్ణబాబు

చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షునిగా బుద్ధా

అనంతరం పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ నూతన కమిటీ ఎంపికయ్యింది. గౌరవాధ్యక్షునిగా బుద్ధా శ్రీనివాసరావు, అధ్యక్షులుగా కూనిరెడ్డి అరుణ, కార్యదర్శిగా రొంగల అరుణ్ కుమార్, కోశాధికారిగా రవికుమార్, కమిటీ సభ్యులుగా మంజుల, హర్షిత, జ్యోత్స్న, అమత, నమ్రత, మనోజ్, సత్య, అంజలి, పవన్, నేహా లక్ష్మి, మధు, బంగారం ఎంపికయ్యారు.

'జగన్ పాలనకు చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి-కోటనందూరు

జగన్ పరిపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య అన్నారు. శనివారం కెఒ.అగ్రహారంలో మీ ఇంటికి మీ దివ్య అనే కార్యక్రమంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచే పేద బలహీన వర్గాల జీవితాలతో సిఎం జగన్ ఆటలు ఆడుకుంటున్నారని అన్నారు. నాలుగేళ్ల పరిపాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. టిడిపి పేద బలహీన వర్గాల అభివద్ధి పార్టీ అని చంద్రబాబు గతంలో అందించిన సంక్షేమ పథకాలనే జగన్ పేరు మార్చి ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యనమల కష్ణుడు, గాడి రాజబాబు, లెక్కల భాస్కర్ మిరియాల సత్యనారాయణ, అంకమరెడ్డి రమేష్, గంట అమ్మాజీ, ఎలమంచిలి చంటిబాబు, బంగారు అప్పలనాయుడు, నెమ్మది సత్యనారాయణ, బోడపాటి సత్యనారాయణ, అంకమరెడ్డి బుల్లిబాబు, రుత్తాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కెఒ.అగ్రహారం గ్రామంలో పర్యటిస్తున్న యనమల దివ్య

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు

ప్రజాశక్తి- గండేపల్లి

మండలంలో శనివారం హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఆయా గ్రామాల్లో అభిమానులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి గ్రామ అధ్యక్షుడు ఎలమాటి కాశి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంపటి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, ఇప్పెర్ల సురేష్, కంటిపూడి సతీష్, ఇప్పర్ల బాబి, కంటిపూడి రామారావు, పైల వెంకన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మోహనరావు

కార్టూ'నిజం'



మరో సలహాదారు నియామకం

విద్యుత్ ఛార్జీలతో పేదల ఇళ్లు గుల్ల

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ విద్యుత్ చార్జీలు పలుమార్లు భారీగా పెంచి వైసిపి ప్రభుత్వం పేదల ఇల్లు గుల్ల చేస్తోందని కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగ దారులపై రూ.57,188 కోట్ల భారం మోపారని, సిఎం జగన్ అసమర్థ నిర్ణయాలతో ఆంధ్ర రాష్ట్రంలో విద్యుత్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో టారిఫ్ కుదింపు, స్లాబు మార్పులు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, అదనపు డిపాజిట్లు అంటూ ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అధిక భారం మోపుతూ దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గదుల సాయిబాబా, పలివెల రవి, అనంత కుమార్, తుమ్మల రమేష్, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్న, ఒమ్మి బాలాజీ, చింతలపూడి రవి, ఎరిపిల్లి రాము, పసుపులేటి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. **ఏలేశ్వరం** పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలతో ప్రజల తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ అన్నారు. పెదశంకర్లపూడిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. జగన్ పేదలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పరిశీలకులు రమణ, కొమ్ముల కన్నబాబు, ముదునూరి మురళీకృష్ణంరాజు, వైబోగుల సుబ్బారావు, యాళ్ల విశ్వేశ్వరరావు ఉన్నారు. **తాళ్లరేవు** విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రభుత్వం ప్రజలను లూటీ చేస్తోందని టిడిపి రాష్ట్ర యువత కార్యనిర్వాహక కార్యదర్శి దూళిపూడి వెంకటరమణ (బాబీ) అన్నారు. వైఎస్.జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.57,188 కోట్ల రూపాయలు భారం వేశారన్నారు. పాదయాత్రలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. మండు వేసవిలో గ్రామాల్లో అధిక విద్యుత్ కోతలు విధిస్తున్నారని, విద్యుత్ వాడకం ఎక్కువైతే పింఛన్లు, అమ్మ ఒడి, వంటి పథకాలు తొలగిస్తున్నారన్నారు. **జగ్గంపేట** నాలుగేళ్ల నుంచి కరెంటు కష్టాలు జగన్ పాలనలోని లోపాల వల్లేనని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కరెంటు కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలోని రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి ఎవరో ఇప్పటికీ తెలియడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్ సమర్థవంతంగా ఇచ్చేవారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్. అప్పలరాజు, మాజీ ఎంపిపి మారిశెట్టి భద్రం, వేములకొంగ జోగారావు, కొత్త కొండబాబు, కొంద్రోతు శ్రీను, గోవిందపురం పద్మనాభం పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విధి నిర్వహణలో రైల్వే సిబ్బంది ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ ఎడిఆర్‌ఎం శ్రీకాంత్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి జె.శ్రీనాథ్ పిలుపునిచ్చారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సు శనివారం స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.శ్రీకాంత్ , సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి జె.శ్రీనాథ్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఒడిశాలో ఘోర రైలు ప్రమాదాన్ని దష్టిలో పెట్టుకొని ప్రయాణికుల భద్రత దష్ట్యా చర్యలు, పలు అంశాలపై సిబ్బందితో చర్చలు జరిపారు.

టిడిపిలోకి మోతుకూరి వెంకటేష్..?

ప్రజాశక్తి-కోటనందూరు



వైసిపిలో తుని నియోజకవర్గంలో తొమ్మిదేళు ్లగా క్రియాశీలక పాత్ర పోషిస్తున్న పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేష్ ఆ పార్టీకి, పదవికి రాజీనామా చేయడంతో ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వెంకటేష్ 2005లో కాంగ్రెస్ పార్టీ తరపున తుని వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ప్రస్తుత మంత్రి దాడిశెట్టి రాజా, వెంకటేష్ బాల్య స్నేహితులు కలిసి చదువుకున్నార్ను. 2008లో ప్రజారాజ్యం పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. వైఎస్.జగన్ ఓదార్పు యాత్రలో దాడిశెట్టి రాజాతో పాటు వెంకటేష్ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నార్ను. 2014, 2019లో దాడిశెట్టి రాజా విజయంలో కీలక పాత్ర పోషించారు. తుని నియోజకవర్గంలో కోటనందూరు, తొండంగి, తుని, తుని రూరల్ ప్రాంతాల్లో ఆయనకు భారీగా అనుచరగణం ఉన్నారు. దీంతో జనసేన, టిడిపి వెంకటేష్‌ను పార్టీలోకి చేర్చుకోవడానికి మంతనాలు సాగిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో వెంకటేష్ తెలుగుదేశం పార్టీ తీర్థం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వైరల్ అవుతుంది.

నేరాలు ఘోరాలు

గోదావరిలో గుర్తుతెలీని మహిళ మృతదేహం

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని గోవలంక గోదావరిలో గుర్తుతెలియని మహిళ మతదేహం స్వాధీనం చేసుకున్నట్టు కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గోవలంక వద్ద గోదావరి నదిలో ఒక గుర్తు తెలియని 30 ఏళ్ల మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మతురాలి కుడి చెయి పై ఒక వైపు శివ అని మరొక వైపు అమ్మ అనే పుట్టుమచ్చలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె వివరాలు తెలిసినవారు 9440796558, 08842303533 నెంబర్లలో తెలియజేయాలని కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు.

ఆవులను తరలిస్తున్న వాహనం సీజ్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని తూర్పు లక్ష్మీపురం రహదారిలో ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఏలేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌హెచ్ఓ మాణిక్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా, తాళ్లతో బంధించి, నీరు మేత పెట్టకుండా తరలిస్తున్నారన్నారు. పశు సంరక్షణ సంస్థ మేనేజర్ దేవరపు మాణిక్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది ఆవులను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని గోసంరక్షణశాలకు తరలించినట్టు తెలిపారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

12 కాసులు బంగారం రూ.4.5 లక్షల నగదు చోరీ జరిగిన సంఘటనపై శనివారంఆ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని లొల్ల గ్రామం రజక పేటలో చెందిన ఉచ్చిలి వెంకటేశ్వరరావు ఈనెల 8న ఇంటికి తాళాలు వేసి తన భార్య ఇద్దరు కుమారులతో కలిసి తను మనవరాలు పుట్టినరోజు కు కాపవరం వెళ్లారు ఈ నేపథ్యంలో శనివారం ఇంటి తలుపులు తీసి ఉండడంతో పక్కింటి వారు ఫోన్ చేసి తెలుపుగా హుటా హుటిన ఇంటికి వచ్చారు. వరు చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండడంతో అందులో ఉన్న 12 కాసుల బంగారం, రూ.4 లక్షల50 వేలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సిఐ రజిని కుమార్, ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికిచేరుకుని క్లూస్ టీం రప్పించి వేలిముద్ర లు సేకరించారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు సంఘటన స్థలాన్ని కొత్తపేట డిఎస్‌పి కెవి.రమణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగుల ఆశలపై నీళ్లు..

గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అవకాశవాద రాజకీయాలతో తమను మభ్య పెడుతోందనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే కాంట్రిబ్యూషనరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లో తెస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించిన విషయం విదితమే. నాలుగేళ్లుగా ఉద్యోగులు దశలవారీ ఆందోళనల నేపథ్యంలో కక్షసాధింపు చర్యలకు సైతం పాల్పడింది. తాజాగా జరిపిన చర్చల్లోనూ సిపిఎస్ రద్దుకు అంగీకరించినప్పటికీ దాని స్థానంలో జిపిఎస్ విధానం అమల్లోకి తెస్తామని చెప్పడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నిర్ణయాన్ని సైతం కొన్ని ఉద్యోగ సంఘాలు స్వాగతించటంపై ఉద్యోగులలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోంది. మరోవైపు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. అయితే 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉండాలనే నిబంధన అశనిపాతంగా మారింది. ఈ లెక్కన 2009లో వైఎస్ఆర్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పద్ధతిన విధుల్లో చేరిన వారు మాత్రమే అర్హులని స్పష్టమవుతోంది. 2009లో సర్వీసులోకి చేరిన అత్యధిక మంది ఉద్యోగులు ప్రస్తుతం 50 ఏళ్ల వయసుకు చేరుకున్నారు. అధికారంలోకి రాగానే చేసినట్లయితే కొంతయినా మేలు జరిగేదని ఆయా వర్గాలు సైతం అభిప్రాయ పడుతున్నాయి. మరో వైపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం రెగ్యులరైజ్ చేస్తామనే హామీని ప్రభుత్వం విస్మరించింది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాలు రాజకీయాలు చేయడంపై విమర్శలకు దారి తీస్తోంది.

వడగాల్పులు.. ఉక్కపోత..

ఎడా పెడా ఛార్జీల మోత మోగిస్తున్న ప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సరఫరాపై దృష్టి సారించకపోవడంతో ఒకవైపు వడగాల్పులు, ఉక్కపోతతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గడిచిన వారం రోజులుగా సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. 43 డిగ్రీల సెల్సియస్ నుండి 45 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు సంశయిస్తున్నారు. మరో వైపు ప్రధాన కూడళ్లు సైతం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వెల వెల బోతున్నాయి. ఇళ్లలో, ఆఫీసుల్లో ఎసిలు, ఫ్రిజ్‌ల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. దీంతో విద్యుత్ డిమాండ్ రోజుకు 19 వేల యూనిట్లు నుంచి 21 వేల యూనిట్లకు చేరింది. ఫలితంగా విద్యుత్ అంతరాయాలు పరిపాటిగా మారాయి. తొలుత పల్లెలకే పరిమితమైన విద్యుత్ అంతరాయాలు ప్రస్తుతం పట్టణాలల్లోనూ పరిపాటిగా మారాయి. మరో వారం రోజులు ఎండలు ఇదే విధంగా ఉంటే విద్యుత్ డిమాండ్ తగ్గట్లుగా సరఫరా చేసే అవకాశాలు తక్కువగా కన్పిస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్ కోతల ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో సమస్య తీవ్రతరం అయ్యే పరస్థితులు నెలకొన్నాయి. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేట్లుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వడి వడిగా నాట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధి కొరవడిందనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషించే జలవనరులను నిల్వచేసుకునేందుకు అవకాశాలు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించడంలేదు. నిధులు లేక అనేక ప్రాజెక్టులు నీరసించి పోతున్నాయి. పోలవరం నిధుల కేటాయింపులపై కేంద్రం మొండి చేయి చూపిస్తున్న విషయం విదితమే. మరో వైపు కాటన్ బ్యారేజీ ఎగువన డ్రెడ్జింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ లోపించింది. అయితే ముందస్తు పేరుతో జూన్1 నుంచి కాల్వలకు నీరు విడుదల చేసి రైతులు సిద్ధం కావాలంటూ ప్రకటనలు గుప్పించింది. రైతు భరోసా, యంత్ర సేవ పేరుతో రైతు గ్రూపులకు ట్రాక్టర్లు ఇతర ఉపకరణాలు అందజేసి ఆర్భాటంగా ప్రచానికి పూనుకుంది. రైతులకు శాశ్వత ప్రయోజనాలిచ్చే అంశాలపై దృష్టి సారించకపోవడం చిత్తశుద్ధి లేమికి దర్పణం పడుతోంది. మరో వైపు ఏటా పెరుగుతున్న ఎరువులు, పురుగుల మందుల ధరలకు కళ్లెం వేయడం లేదు. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. మరో వైపు కౌలు రైతులకు సాయం అందించే పరిస్థితులు లేవు. సాగు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడులకు నగదు అందజేసి చిత్తశుద్ధి నిలుపుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిసిఆర్‌సి కార్డుల మంజూరులో నిబంధనలు సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతేడాది ముందస్తు సాగు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. గోదావరి వరదల కారణంగా అనేక పంటలు నేలమట్టం అయ్యాయి. కాల్వల ఆధునీకరణ, పూడికతీతలు లేకపోవటమే ఈ దుస్థితి కారణమని గత అనుభవాలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది కూడా ఆధునీకరణ పనులు చేపట్టకపోవటం పాలకుల తీరును విమర్శల పాల్జేస్తుంది.

కాకినాడ సెజ్‌లో మల్టీప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై ప్రజాగ్రహం పెల్లుబికింది. ఈ వారంలో అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తీర ప్రాంతంలో సముద్రంపై ఆధారపడి సుమారు 50 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. కాలుష్య కారక పరిశ్రమలు రాకతో మత్స్య సంపద పూర్తిగా దెబ్బతింది. మత్స్యకార కుటుంబాలు వేటకోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మరో నూతన పరిశ్రమలకు ఎర్రతివాచీ పర్చడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి దర్పణం పడుతోంది.

యానాం వార్తలు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(వైడిసిఎ) ఆధ్వర్యంలో క్యాప్ టి-12 సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ -2023 స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. అగ్ని లయన్స్, కెవిఆర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్ బాబు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇరుజట్లు తలపడనున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్, ఎస్‌పి, సిఐ, ఎస్ఐ పాల్గొని ప్రారంభిస్తారన్నారు.

వికలాంగులకు ఉచితంగా విద్య

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో మానసిక దివ్యాంగులకు ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు సెంటర్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాల సిబ్బందితో నియోజకవర్గంలో సర్వే నిర్వహించారు. మానసిక దివ్యాంగులు, ఎదుగుదల లేని వారు, అంగవైకల్యం ఉన్న వారు ఉంటే సమాచారం అందించాలని కోరుతూ గ్రామాల్లో కరపత్రాలను పంచారు.

డ్రెయినేజీల పరిశీలన



యానాం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని డ్రెయినేజీలను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్ అధికారులతో కలిసి పరిశీ లించారు. ప్రధానంగా స్థానిక పిల్లారాయవీధి రోడ్ నుంచి పోలీసు స్టేషన్ ప్రాంగణంలోని పోలీసు క్వార్టర్స్ వరకూ ఇటీవల డ్రైన్ నిర్మించారు. అయితే డ్రైన్లకు పలు చోట్ల ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌పై ప్లేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్లేట్లు లేక డ్రైన్ లో పడిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఎంఎల్ఎ పరిశీలించారు. ప్రజాపనులశాఖ ఇఇ వీరసెల్వం, జెఇ నాగరాజు, తక్షణమే ప్లేట్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్వానంగా ఉన్న ఎస్‌పి ఆఫీసు ప్రక్కన గల డ్రైన్ పరిస్థితిని పరిశీలించారు. ఈ డ్రైన్ నుంచి కాంప్లెక్స్ రోడ్డులోని ప్రధాన కాలవలోకి మురికినీరు వెళ్లే విధంగా పనులు చేపట్టాలని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఇఇకి సూచించారు. నీరు నిలిచిపోకుండా పూర్తిస్థాయిలో డ్రైన్ పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. సిఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు, పి.సిద్ధార్థ్ కుమార్, చిక్కాల నరసింహమూర్తి ఎంఎల్ఎ వెంట ఉన్నారు.

ఉపాధ్యాయులకు విద్యా ప్రణాళికపై శిక్షణ

నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో విద్యా ప్రణాళికపై ఉపాధ్యాయులకు శనివారం సిబీఎస్ఈ ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.

ఆలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి పూజలు

యానాం పిల్లారాయస్వామి ఆలయంలో లంకా చంద్రరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజలు నిర్వహించారు. ప్రజాపనుల శాఖ ఇఇ వీర సెల్వం, జెఇ నాగరాజు, జ్యోతిరాజు, సిఐ షణ్ముగం, దవులూరి శ్రీనివాస్ లయన్స్ క్లబ్ పిల్లారాయా అధ్యక్షులు పులవర్తి శ్రీను, చిక్కాల నరసింహమూర్తి, పండు సిద్ధార్థ్ కుమార్, చెక్కల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే రాజ్యాంగ పరిరక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

మనువాదం, మతోన్మాదం పెచ్చురిల్లుతున్న నేపథ్యంలో దళితులు, మైనార్టీలు, బహుజనుల ఐక్యపోరాటంతో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావలవన్ పిలుపునిచ్చారు. శనివారం సత్తెమ్మతల్లి లేఅవుట్‌లో ఆయన అధ్యక్షతన స్వయంపాలన సంకల్ప దీక్ష పేరుతో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరి కొన్ని నెలల్లోనే ఎన్నికలు రాబోతున్నాయన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను రాజకీయ అధికారం చేజిక్కిచ్చుకోనేందుకు ఆధిపత్య కులాల పార్టీలు సన్నద్ధమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారన్నారు. తదనంతరం తన కుమారుడు లోకేష్‌కు ఆ పదవిని కట్టబెట్టాలని రాష్ట్రమంతా తిరుగుతున్నాడని తెలిపారు. వైఎస్ఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారు. ఆయన మరణానంతరం కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చారు, ఇప్పుడు మళ్లీ అధికారం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాని వేల సంవత్సరాల నుండి అధికారానికి దూరంగా వున్న అణగారిన కులాలు రాజ్యాధికారం కోసం ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. ఒక వైపు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. అసమానతను సుస్థిరం చేసే సనాతన ధర్మం పునాదిగా మరో రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. పూలే,అంబేద్కర్ అణగారిన ప్రజల కోసం సాధించిన ప్రత్యేక హక్కులను ఒకే చట్టం పేరుతో కాలరాయాలని చూస్తున్నాయన్నారు. రోజురోజుకూ అణగారిన కులాల ప్రజలపై హత్యలు, అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ప్రభుత్వం దోషులను అరెస్టు చేయడం మానేసి నష్టపరిహారం ఇచ్చి సరిపెడుతున్నాయన్నారు. దళిత ప్రజాప్రతినిధులు సైతం ప్రశ్నించే వీలుండట్లేదన్నారు. మనల్ని మనం పరిపాలించుకునే స్వయం పాలనతోనే వీటికి చెక్ పెట్టగలమన్నారు. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. దళితులు, బహుజనుల హక్కుల రక్షణ కోసం కలిసొచ్చే పార్టీలతో సిపిఎం పోరాడుతుందన్నారు. తమిళనాడులో విసికెతో సిపిఎం, సిపిఐలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత దేశంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. బిజెపి పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సంస్థలను దేశంలో నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, విశ్రాంత రైల్వే ఉద్యోగి భారత భూషణ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, విసికె పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి జీలుకర శ్రీనివాస్, విశ్రాంత హైకోర్టు న్యాయవాది బాలయోగి, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ గురైన సెల్‌ఫోన్ల రికవరీ



దొంగలించబడిన సెల్ ఫోన్లు తిరిగి అందజేస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి -అమలాపురం

చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు 150 ఫోన్లు జిల్లా ఎస్‌పి యస్.శ్రీ ధర్ ఆయన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ల మిస్సింగ్ కేసులు ఎక్కువైనందున, పోగొట్టుకున్న మొబైల్స్ ను బాధితులకు అందజేసే నిమిత్తం, ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేయడం జరిగిందన్నారు. చాట్ బోట్ సేవలు ప్రారంభించి, మూడవ దశ లో రూ. 30,00,000 విలువ చేసే 150 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శనివారం బాధితులకు వారి ఫోన్లను అందజేశామన్నారు. మొత్తంగా ఇప్పటివరకు 412 ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. తక్కువ వ్యవధిలోనే తిరిగి వారి ఫోన్ చేతికందడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. చాట్ బోట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ఫోన్ చోరీకి గురయినా, మిస్ అయిన వారు, ఈ వాట్సాప్ నంబర్ 8522913300 కు హాయ్ లేదా హెల్ప్ అని మెసేజీ పంపాలన్నారు. ఇది ప్రారంభమే అని ఈ విధానము ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది అని దీనిని ప్రజలు సద్వినియోగం పరచుకొని పోగొట్టుకున్న మొబైల్స్ ను పొందవచ్చన్నారు. ఎవరికైనా దొరికిన సెల్ ఫోన్ లను సొంతానికి వాడుకోవడం కాని, గుర్తు తెలియని వ్యక్తులు ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్ లను కొనడం కాని చేయకూడదన్నారు. మీకు దొరికిన సెల్ ఫోన్లను దగ్గర లో ఉన్న పోలీసు స్టేషన్ కి అందజేయాలని జిల్లా ఎస్‌పి యస్. శ్రీధర్ తెలియజేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి యస్. ఖాదర్ బాషా ఆధ్వర్యములో సెల్ ట్రాకింగ్ టీమ్ అయిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. గోవిందరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.రజని కుమార్ , యస్ఐలు జి.నరేష్, జె. భానుప్రసాద్, సంపత్ కుమార్, ఫణి మోహన్, ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్స్ తదితరులను ఎస్‌పి అభినందించినారు.

నేడు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-కాజులూరు

గృహ నిర్మాణాలకు సంబంధించి ఆదివారం ఉదయం పట్టాలు పంపిణీ చేస్తామని తహశీల్దారు బి.సాయి సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని శలపాక గ్రామంలో తహసిల్దార్ సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 5 గ్రామాలకు సంబంధించి శలపాక గ్రామంలో మంత్రి వేణుగోపాలకృష్ణ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని అన్నారు. గొల్లపాలెం గ్రామానికి సంబంధించి 198, శలపాక గ్రామానికి సంబంధించి 141, తణుకువాడ గ్రామానికి సంబంధించి 34, మతకుమిల్లి గ్రామానికి సంబంధించి 29, బంధనపూడి గ్రామానికి సంబంధించి 53 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు ఈశ్వరరావు, సత్తిబాబు, గణికమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇకపై నెలకో వార్డులో రచ్చబండ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇకపై నెలకో వార్డులో 'రచ్చబండ' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం లలితానగర్ వినాయకుని గుడి వద్ద ఏర్పాటు చేసిన వైసిపి వార్డు కార్యాలయాన్ని వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ నగరంలో ప్రతీ వార్డులో పార్టీ కార్యాలయాలను ఆయా వార్డు ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. నగరంలో ప్రప్రథమంగా 37వ వార్డులో బాలాజీ రెడ్డి ఔదార్యంతో రెడ్డి సూరిబాబు, సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యాలయం ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్గాని సురేష్, కాంతారాం పాటిల్, సంకిస భవానీ ప్రియ, ఎన్వీ శ్రీనివాస్, నక్కా నాగేష్, ప్రవీణ్ చౌదరి, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మహేష్

మహేష్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-అయినవిల్లి

టిడిపి జాతీయ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సోషల్ మీడియా అభినందన సభ జరిగింది. పార్టీజాతీయ అధ్యక్షులు మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు విచ్చేసి సోషల్ మీడియాలో చురుకుగా పనిచేస్తూ, టిడిపి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్న వారికి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం నియోజక వర్గం ఐటిడిపి అధ్యక్షులు అప్పారి మహేష్ ప్రశంసా పత్రం అందుకున్నారు. అప్పారి మహేష్‌కు పలువురు నాయకుకులు అభినందనలు తలియజేశారు,

గణపతిరావుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం



గణపతిరావును పరామర్శిస్తున్న దృశ్యం

భార్యావియోగంతో బాధపడుతున్న వన్నె చింతలపూడి కి చెందిన కుంచే గణపతిరావు ను అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు శనివారం పరామర్శించారు. గణపతిరావు భార్య అమ్మాజీ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను రమణారావు, సర్పంచ్ నక్కా కృష్ణ తదితరులు పరామర్శించారు.

దళిత నాయకుని కుటుంబానికి..

ఉప్పలగుప్తం ఇటీవల అనారోగ్యంతో ఉప్పలగుప్తం పంచాయతీ కామరాజుపేటకు చెందిన దళిత నాయకుడు తాళ్ల శత్రుఘ్నుడు మతి చెందారు.ఆ కుటుంబాన్ని శనివారం అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, నాయకులు పరామర్శించారు. శత్రుఘ్నుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపిటిసి సభ్యులు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, పార్టీ నాయకులు చిక్కం భీముడు, చిక్కాల సతీష్, ఆకుల బుజ్జి, తాళ్ల రవి, .

లక్ష్మికి ఎంఎల్ఎ పొన్నాడ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మాజీ ఎంపిటిసి గంజా సూరిబాబు సతీమణి గంజా లక్ష్మిని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ శనివారం పరామర్శించారు. ఏడాదికాలంగా లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఎంఎల్ఎ వెంట ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవింద్ కుమార్, రేవు మల్లీశ్వరి, ఆకుల వెంకన్న, బొంతు మోహన్, చలపతి, లక్ష్మీనారాయణ, భూసారపు పద్మారావు, బొంతు శ్రీను, కొల్లు శ్రీను, పండు పాల్గొన్నారు.

వల్లభస్వామికి రూ.3.15 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,36,540, అన్నదానం విరాళాల ద్వారా రూ.64,441, కేశఖండన ద్వారా రూ.14,950 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, వేసవిని దష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, సిబ్బంది కష్ణ, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీకుమార్, గ్రామ ప్రజలు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారన్నారు.

వారాహి యాత్ర విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



వారాహి యాత్ర పోస్టర్‌ను విడుదల చేసిన రాజబాబు

అమలాపురంలో ఈనెల 21న జరిగే వారాహి యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు కోరారు. కూనవరంలో శనివారం వారాహి యాత్ర పోస్టర్‌ను రాజబాబు ఆవిష్కరించారు. వారాహి యాత్ర లో భాగంగా ఆరోజు అమలాపురంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకుల బుజ్జి, సాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-రామచంద్రపురం



మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

వైసిపి పాలనలో విద్యుత్ లోటుతో, కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని టిడిపి ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధికారం లోకి వచ్చిన తర్వాత 2022లో రైతులు మొదట సారిగా పవర్ హాలిడే ప్రకటించారన్నారు. కరెంటు కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందిప డుతున్నారని, తక్కువ వోల్టేజ్ కారణంగా చేనేత కార్మికులు, ఆక్వారైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు 9 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన జగన్ ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని రెడ్డి సుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైపిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటికీ ఏడు సార్లు చార్జీలు పెంచారని గుర్తు చేశారు. అదనపు లోడ్ చార్జెస్ పేరుతో వినియోగదారులపై రూ.2 వేల నుంచి రూ.5వేలు వసూలు చేస్తోందన్నారు. అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పి టిడిపిని రాష్ట్ర అభివద్ధి కోసం గెలిపించాలని రెడ్డి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గరికపాటి సూర్యనారాయణ మూర్తి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మేడిశెట్టిసూర్యనారాయణ, పంపనశ్రీనివాసు, కొసనా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట రెండు పట్టణాలు, రెండు మండలాల పరిధిలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారయ్యిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమస్యలను అధికారుల దష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న వారు లేరన్నారు. ప్రజల ఆహ్లాదం కోసం పెద్దాపురం పట్టణంలో శతాబ్ది పార్కు నిర్మించామని, సెలవు రోజుల్లో సుమారు పదివేల మంది పార్కును సందర్శించి కుటుంబ సభ్యులు, పిల్లలతో ఆనందంగా గడిపే వారన్నారు. అటువంటి ఆహ్లాదకరమైన పార్కును నిర్వహించలేక తాళాలు వేయడం దురదష్టకరమన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), కందుల విశ్వేశ్వరరావు, నూనె రామారావు పాల్గొన్నారు.